క్లుప్తంగా

నేడు మంత్రి 'కొల్లు' ప్రజాదర్బార్

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి ఈ నెల 14వ తేదీ ఆదివారం నగరంలోని టీడీపీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 8 గంటల నుంచి మంత్రి రవీంద్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. 79959 32254కు ఫోన్ చేసి టోకెన్ నంబర్ పొందాలని సూచించారు.

నేడు అందుబాటులో ఎంపీ, ఎమ్మెల్యే

బంటుమిల్లి: మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పెడన టీడీపీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని శనివారం ఆ పార్టీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

16, 17 తేదీల్లో 'చాగంటి' ప్రవచనాలు



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలో ఈ నెల 16, 17 తేదీల్లో డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హిందూ ఐక్య వేదిక ప్రతినిధులు శనివారం తెలిపారు. స్థానిక మెహర్‌బాబా ఆడిటోరియంలో ప్రవచన కార్యక్రమ కరపత్రాన్ని వేదిక ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని మూడు స్తంభాల సెంటర్ సమీపంలో ఉన్న గోల్డ్ కన్వెన్షన్ హాల్లో సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నిత్య పూజా విధానం అంశంపై చాగంటి కోటేశ్వరరావు అనుగ్రహణ భాషణం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంపీ బాబాప్రసాద్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా మాజీ చైర్మన్ మామిడి మురళీకృష్ణ, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గూడూరు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలపై చెట్టు కొమ్మ విరిగిపడటంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గూడూరు మండలం మల్లవోలుకు చెందిన ముద్దినేని శ్రీనివాసరావు(50) భార్య విజయనిర్మలతో కలిసి గత నెల 22న మచిలీపట్నం వెళ్తున్నారు. మల్లవోలు ఊరు దాటిన తర్వాత డబుల్ టర్నింగ్‌లో మామిడి చెట్టు కొమ్మ విరిగి అమాంతం వీరిపై పడింది. ఘటనలో శ్రీనివాసరావు, అతని భార్య విజయనిర్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు చెవుల నుంచి రక్తస్రావం అవుతుండటంతో స్థానికులు ఆటోలో బందరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెరుగైన చికిత్సకు మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ విజయనిర్మల కోలుకుని ఈ నెల 6 డిశ్చార్జ్ అయ్యారు. కోమాలో ఉన్న శ్రీనివాసరావు శనివారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై గూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావు మృతదేహానికి శవపంచనామా చేసి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నేడు దివిసీమకు సాగునీరు

మోపిదేవి: మండల పరిధిలోని మోపిదేవి వార్ఫు అక్విడెక్ట్ వద్ద అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదివారం ఉదయం 11 గంటలకు దివిసీమకు సాగు–తాగునీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ డీఈ రవికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొనాలని కోరారు.

కుష్ఠు నిర్మూలనపై అవగాహన

బంటుమిల్లి: పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శనివారం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన సమావేశం జరిగింది. డాక్టర్ కె. సువర్చల మాట్లాడుతూ కుష్ఠు అనేది ఒక మైక్రోబ్యాక్టీరియా లెప్రో క్రిమి కారణంగా వస్తుందన్నారు. దీన్ని గుర్తించడానికి ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. దీనిలో రక్త సేకరణ చేసి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామన్నారు. ఈ వ్యాధి తుమ్మడం, దగ్గడం ద్వారా గాలి నుంచి ఇతరులకు వ్యాపిస్తుందని డాక్టర్ పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.ఏ సుదాసు, ఏడుకొండలరావు, పెద్దిఈశ్వరి, కమలరత్నం, రాజారావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కోడూరులోని పొల్లాల్లో వాన నీరు



కోడూరులో కుండపోతగా కురుస్తున్న వర్షం



జలమయమైన మచిలీపట్నం బస్టాండ్ ప్రాంగణం



మల్లవోలులో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

జోరువాన..

రోడ్లు, పొలాలు జలమయం

మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి రోడ్లు, పంటపొలాలు జలమయమయ్యాయి. జిల్లా కేంద్రం మచిలీపట్నం కుండపోత వర్షానికి తడిచి ముద్దయింది. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కురిసిన భారీ వర్షానికి నగరంలోని ప్రధాన రోడ్లతోపాటు లోతట్టు కాలనీలు జలమయంగా మారాయి. పెడన, గూడూరులో కురిసిన జోరువానకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. కోడూరులో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. కేవలం ఐదు గంటల్లో 152.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మెరకగౌడపాలెం, అంబటి బ్రహ్మణయ్య కాలనీ, యర్రారెడ్డివారిపాలెం, జయపురం, వి.కొత్తపాలెం, పిట్టల్లంక గ్రామాల్లో రోడ్లపై నీరు నిలిచింది. పులిగడ్డ మరిడి మహాలక్ష్మీ ఆలయం నీటమునిగింది. సమీపంలో ఏర్పాటు చేసిన పులిగడ్డ టోల్‌ప్లాజా వల్ల ఈ ఆలయం నీటమునుగుతోందని స్థానికులు తెలిపారు.

–మచిలీపట్నంటౌన్/కోడూరు/గూడూరు/అవనిగడ్డ



ద్విచక్రవాహనం మొరాయించడంతో వాహనచోదకుని ఇక్కట్లు



బందరు ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు

గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, కౌన్సిలర్ ప్రసాద్
- ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి మీలా అవినీతికి పాల్పడలేదు
- అనుచిత వ్యాఖ్యలు సరికాదని హితవు

పెడన: ఎవరు అవినీతికి పాల్పడింది, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అమ్ముకున్నది ఎవరో పురప్రజలకు తెలుసని, గౌరవం ఇచ్చి పుచ్చుకుంటే అందరికీ మంచిదని పెడన పురపాలక సంఘ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కౌన్సిలర్ కటకం ప్రసాద్ స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ శనివారం తన చాంబర్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నాగకుమారి మాట్లాడుతూ టీడీపీ వారు బురదజల్లాలని చూస్తున్నారని, ఎవరు ఎలాంటి వారో చూసుకుని మాట్లాడాలన్నారు. మేము చైర్‌పర్సన్ పదవి చేపట్టడానికి చాలా మందికి ఇష్టం లేదని, అయినా ఆ భగవంతుడి దయతో పదవి వచ్చిందన్నారు. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ వారం క్రితం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నిర్వహించిన మున్సిపల్ అధికారుల రివ్యూ మీటింగ్‌లో కొందరు అవినీతి ఆరోపణలు చేశారన్నారు. ఈ సమావేశానికి ముందుగానే మున్సిపల్ స్థితిగతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ఎలాంటి సమస్యనైనా పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు తన కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇది తగదని హితవు పలికారు. గతంలో మీరు చేసిన అవినీతి చిట్టాలకు కూడా మా వద్ద ఆధారాలున్నాయని, మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి 20 మంది లబ్ధిదారులకు విక్రయించిన విషయంపై కోర్టుకైనా వెళ్లడానికి సిద్ధమని కటకం ప్రసాద్ హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు రహెతున్నీసా, జయేష్ సతీష్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో నాగకుమారి, ప్రసాద్, ఇతర నేతలు

బాధిత కుటుంబాలకు పరామర్శ



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి ఎస్సీ కాలనీలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబ సభ్యులను ఆ పార్టీ నాయకులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు శనివారం పరామర్శించారు. ఎస్సీకాలనీకి చెందిన లంకా రాజు ఇటీవల మరణించగా ఆయన భార్య జాస్మితను, కొమ్ము రాజేశ్వరరావు కుమార్తె చనిపోయిన కొమ్ము రాజేశ్వరరావుని చంద్రశేఖరరావు, యువనేత సింహాద్రి రామ్‌చరణ్ పరామర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు వెనిగళ్ళ తారకజగదీష్, చంద్ర దుర్గాబాబు, కొమ్ము డేవిడ్, కొక్కిలిగడ్డ రాజారావు, పైడిపాముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గంగాభవాని అమ్మవారికి సారె సమర్పణ

కోడూరు: పంటలు సమృద్ధిగా పండి, లోకం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆదివారం కోడూరు గంగాభవానీ అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు శనివారం తెలిపారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం యర్రారెడ్డివారిపాలెం గ్రామ మహిళలు అమ్మవారికి సారెను తీసుకువస్తారన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం



అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కోటగిరిలంక ఆర్‌సీఎం రోడ్డులో మురుగు సమస్యను పరిష్కరించారు. ఈ సిమెంట్ రోడ్డు పక్కనే పెంటపోగు వేయడంతో మురుగు పోక తీవ్ర ఇబ్బందులు పడేవారు. చర్చికి వెళ్లే విశ్వాసులు పలు సమస్యలు ఎదుర్కొనేవారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ఈవో తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జేసీబీతో పెంటపోగుని తీయించి బాగుచేయించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్రా సుధాకర్, ఆనంద్ బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చేది ఉపాధ్యాయులే

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కనకారావు

అవనిగడ్డ: సమాజాన్ని మార్చేశక్తి ఉపాధ్యాయులకే ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బండెల కనకారావు అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీకే విజ్ఞాన భవనంలో గతనెలలో ఉద్యోగ విరమణ పొందిన కైలా సుమతికుమారికి శనివారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయునికి ఎంతో గౌరవం ఉందని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్‌బాబు మాట్లాడుతూ సుమతికుమారి 41 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో పని చేయడం సామాన్య విషయం కాదన్నారు. పాలకులు విద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేసే నిర్ణయాలు తీసుకున్నప్పుడు తీవ్రస్థాయిలో వ్యతిరేకించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ సందర్భంగా సుమతికుమారి,రాఘవులు దంపతులను ఘనంగా సత్కరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కాజ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు బి.జి. గోపాలకృష్ణ, ఎస్.వెంకటేశ్వరరావు, ఎల్ సుభాషిణి, మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, ఎల్ఐసీ రిటైర్డ్ డీవో జీవీరావు తదితరులు పాల్గొన్నారు.



సుమతికుమారి,రాఘవులును సత్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా నాయకులు

రోడ్లపై యథేచ్ఛగా పశువులు

కోడూరు: పశువుల గుంపులు రహదారులపై యథేచ్ఛగా తిరగడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మండలంలోని పాలకాయతిప్ప, హంసలదీవి, రామకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు తమ ఆవులను సమీప సాగరతీరంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఆవుల గుంపులు సాగరతీరం ప్రాంతంలో తిరగకుండా ఊళ్ల మీదకు చొచ్చుకువచ్చాయి. కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో ఈ ఆవుల గుంపులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కోడూరు వంతెన సెంటర్ నుంచి తూర్పు వైపు వరకు రహదారిపై సంచరించడంతో వాహనచోదకులు నిత్యం ప్రమాదాలు బారిన పడుతున్నారు. వాహనాలకు దారి ఇవ్వకపోవడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఎదరవుతోంది. భారీ వాహనచోదకులు పొరపాటున ఆవులపై నుంచి వాహనాలను నడపడంతో అవి మృతిచెందుతున్న ఘటనలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు ఆవులను తప్పించబోయి రహదారిపై పడిపోవడంతో తీవ్ర గాయాలవుతున్నాయి. స్థానిక పోలీస్, అటవీ, రెవన్యూ అధికారులు స్పందించి సంబంధిత ఆవుల యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి ప్రజలు కోరుతున్నారు.



కోడూరులో రోడ్డుపై ఆవుల గుంపు కారణంగా నిలిచిపోయిన వాహనాలు

బలహీన వర్గాల కోసమే సంక్షేమ హాస్టళ్లు

శ్రీకాకుళం(ఘంటసాల): బలహీన వర్గాల విద్యార్థుల కోసమే సాంఘిక సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు వీటిని వినియోగించుకోవాలని తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు చెప్పారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో శనివారం విద్యార్థిని తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్స్‌లో విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. వసతి గృహం అధికారి పి.జ్ఞానసుందరి మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలికలు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించడంతో పాటు కాస్మెటిక్స్ చార్జీలు కూడా చెల్లిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్.కమలాకరరావు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రసాద్ బాబు

బంటుమిల్లి నుంచి ముగ్గురికి ట్రిపుల్‌ఐటీ సీట్లు



జి. విఘ్నేష్



బి. ఐశ్వర్య



వీఎస్ఎల్ శ్రీవిద్య

బంటుమిల్లి: మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని ఎంఈఓ బి. త్రిపురసుందరీదేవీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి. విఘ్నేష్ శ్రీకాకుళం, బి. ఐశ్వర్య ఒంగోలు, కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థిని వీఎస్ఎల్ శ్రీవిద్య ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు దక్కించుకున్నారని వివరించారు. సత్తా చాటిన విద్యార్థులను ఎంఈఓలు త్రిపురసుందరీదేవి, వెంకటేశ్వరరావు, హెచ్ఎం రామచంద్రరావు, కొమ్మారెడ్డి పాఠశాల డైరెక్టర్ కె.కిషోర్, కరస్పాండెంట్ కె. శోభ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

వందనమమ్మా.. వారాహి

నాగాయలంక: కృష్ణా తీరం శ్రీకనకదుర్గమ్మ ఆలయంలోని శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రుల ఉత్సవంలో భాగంగా శనివారం అమ్మవారు మహాగౌరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని గాజుల మలారాలతో అలంకరించి పసుపు కుంకుమలతో విశేషార్చన చేశారు. వారాహి దీక్షధారులు ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాస శాస్త్రి, ముదునూరి అమృత శేఖరశర్మ బ్రహ్మత్వంలో తెల్లవారు జామున 5గంటలకు వారాహిదేవి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కనకదుర్గమ్మ కూడా గాజుల ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీరామ క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణప్రసాద్(బుజ్జి), బోయపాటి రాము, మహిళలు, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.



నాగాయలంకలో పీఠంపై మహాగౌరిగా గాజుల అలంకారంలో కొలువైన వారాహిమాత

శ్యామలాంబకు ఆషాఢం సారె

పెడన: పట్టణంలోని శ్రీశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి శనివారం స్థానిక శ్రీవాసవి మహిళా మండలి సభ్యులు ఆషాఢం సారె సమర్పించారు. దేవాలయం పూజారి ఓంకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సారెతో వాసవి మహిళా మండలి సభ్యులు

సాగుదారులందరికీ కౌలుగుర్తింపు కార్డులు ఇవ్వాలి

కంకిపాడు: వాస్తవ సాగుదారులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి, సాగుకు చేయూత అందించాలని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. భూయజమాని సంతకం తప్పనిసరి నిబంధన ఎత్తివేయాలని కోరుతూ ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో ఉప్పలూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రంగారావు మాట్లాడుతూ.. కౌలుకార్డులు లేకపోవడంతో కౌలురైతులకు ఆర్థిక చేయూత, సహాయ సహకారాలు అందడం లేదన్నారు. కౌలుకార్డుల జారీ ప్రక్రియను సరళతరం చేసి వాస్తవ సాగుదారులందరికీ కౌలుకార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం యోచించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.చంటిబాబు, దొండపాటి సాంబయ్య, వి.రమేష్, టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలూరులో సంతకాలు సేకరిస్తున్న కౌలురైతు సంఘం ప్రతినిధులు

సెలవుదినాలు కచ్చితంగా పాటించాలి

గుడివాడ టౌన్: విద్యా సంస్థల్లో సెలవు దినాలను కచ్చితంగా అమలు చేయాలి ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సమీర్ కోరారు. పట్టణంలోని కార్పొరేట్ కళాశాలలు, విద్యాసంస్థలు తరగతులు నిర్వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. కళాశాలల యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి శనివారం తరగతులకు హాజరైన విద్యార్థులను బయటకు పంపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను మార్కుల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థుల మానసిక వికాసం కోసం సంస్థలు పనిచేయాలని స్పష్టంగా తెలిపినా కార్పొరేట్ విద్యాసంస్థలు వాటిని పట్టించుకోవడంలేదన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, ఇతర అధికారులు సైతం ఈ విషయంలో నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించడం దారుణమన్నారు. వెంటనే అధికారులు స్పందించి కార్పొరేట్ విద్యాసంస్థలకు హెచ్చరికలు జారీ చేయాలని ఆయన సూచించారు.



తరగతుల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

భారీ వర్షానికి పడిపోయిన విద్యుత్ స్తంభాలు

దేవరకోట(ఘంటసాల): ఎడతెరిపి లేని భారీ వర్షానికి ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలో మూడు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సమాచారం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్ గ్రామానికి చెందిన లైన్‌మెన్ కె.సమూయేలును సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కార్మికులతో కలసి పడిపోయిన విద్యుత్తు స్తంభాలను ట్రాక్టర్లు, క్రేన్ సాయంతో శనివారం నిలబెట్టి విద్యుత్ సరఫరా ఇచ్చారు.



దేవరకోటలో క్రేన్‌తో విద్యుత్తు స్తంభాన్ని నిలబెడుతున్న కార్మికులు